క్లుప్తంగా

నేడు ముక్కోటి మైసమ్మ జాతర

మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్‌–నంచర్ల మధ్య గల ముక్కోటి మైసమ్మ జాతర ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అనంతరం బోనాలు, జాతర ఉంటుందని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రగతి స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జీఎం శ్రీనివాసన్, ఓఎం శివప్రసాద్, పీఓ వెంకట్రాములు, పీఎం వెంకటయ్యగౌడ్, ఏఈ కోటేశ్వర్‌రావులు శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు.

నేడు కవులు, కళాకారులకు అవార్డుల ప్రదానం

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉగాదిని పురస్కరంచుకుని ఉమ్మడి పాలమూరు జిల్లా కవులకు, కళాకారులకు ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో బెల్లం సత్యమ్మ స్మారకార్థం బెల్లం సత్యమ్మ ట్రస్ట్ వారు అవార్డుల ప్రదానం, సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధి బెల్లం సాయులు తెలిపారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా కవులు, కళాకారులు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కేంద్ర పథకాలు వివరించండి

మిడ్జిల్: మండలంలోని వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, చిల్వేర్‌లో బీజేపీ బూత్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ.. బూత్ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, బీజేపీకి ఓటు వేయాలని కోరాలని సూచించారు.

న్యాయమూర్తులను కలిసిన బార్ అసోసియేషన్



జడ్చర్ల టౌన్: బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి లక్ష్మి, అదనపు కోర్టు న్యాయమూర్తి ముజీద్‌ను కలిశారు. అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి అసోసియేషన్‌కు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో 97.8 శాతం పన్ను వసూలు

బాలానగర్: మండలంలోని 37 గ్రామాల్లో 97.8 శాతం పన్ను వసూలైనట్లు ఎంపీడీఓ శరత్ చంద్రబాబు, ఎంపీఓ విజయకుమారి తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఈ పన్నులను రాబట్టినట్లు ఎంపీఓ పేర్కొన్నారు. మొత్తం రూపాయలు రూ.1,26,15,344 పన్నుల రూపంలో రావాల్సి ఉండగా రూ.1,19,70,038 చెల్లింపులు వచ్చాయని ఎంపీఓ వివరించారు. అందులో 21 గ్రామాల్లో 100 శాతం, 16 గ్రామాల్లో 95 శాతం మేర ప్రజలు పన్నులు చెల్లించినట్లు ఆమె పేర్కొన్నారు.

పోమాల్ మాలిక్‌షా ఉర్సు ప్రారంభం



నవాబుపేట: మండలంలోని పోమాల్ సమీపంలో గల హజ్రత్ మాలిక్‌షా దర్గా ఉర్సు సందర్భంగా శనివారం గంధోత్సవం నిర్వహించారు. రెండ్రోజుల పాటు ఉర్సులో ఖవేలి ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని ఉత్సవ నిర్వాహకుడు మునిరుద్దీన్ ఖాద్రీ తెలిపారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుని ఉర్సులో పాల్గొంటారని తెలిపారు. ప్రత్యేకంగా ఖవేలి కార్యక్రమంలో గఫూర్ బృందం పాల్గొంటుందని ఆయన తెలిపారు.

అంబేద్కర్ జాతరకు తరలిరండి



కోయిల్‌కొండ: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో ఏప్రిల్ 27వ తేదీన నిర్వహించే అంబేద్కర్ జాతరకు మండలంలోని దళితులు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటయ్య, కురుమయ్య, మైబు, రాజు, నందు టైలర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ రుచులు



హరీస్, హలీంను ప్లేట్‌లో వడ్డిస్తున్న మాస్టర్లు

- ప్రత్యేక వంటకం హరీస్ (హలీం)
- సంప్రదాయమైన బలవర్ధకమైన ఆహారం
- కులమతాలకతీతంగా హరీస్ ఆరగింపు
- జిల్లా వ్యాప్తంగా వెలిసిన దుకాణాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసం అంటేనే ప్రత్యేక వంటకం హరీస్ (హలీం) గుర్తుకొస్తోంది. రంజాన్ మాసంలో ఈ వంటకం సంప్రదాయంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. కేవలం ఈ నెల రోజుల రంజాన్‌లోనే ఈ హరీస్ లభిస్తుండడం విశేషం. రంజాన్ మాసంలోనే ప్రత్యేకంగా తయారు చేసే హరీస్ కోసం ఎంతో మంది ఎదురు చూస్తారు. ముస్లింలే కాకుండా అన్ని మతాల వారు వీటిని ఇష్టంగా ఆరగిస్తారు. మహబూబ్‌నగర్ పట్టణంతోపాటు జిల్లాలోని పలు పట్టణ ప్రాంతాల్లో హరీస్ దుకాణాలు వెలిశాయి. సాయంత్రం ఇఫ్తార్ అనంతరం నుంచి అర్ధరాత్రి దాకా దుకాణాల వద్ద సందడి అంతాఇంతా కాదు. రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం కలగలిసిన పసందైన వంటకమిది.

జిల్లాలో పలు చోట్ల స్టాల్స్..

జిల్లా కేంద్రంతోపాటు పట్టణాల్లో హరీస్ (హలీం) స్టాల్స్ వెలిశాయి. గతంలో పట్టణాలకే పరిమితమైన హరీస్ ఇప్పుడు మండల కేంద్రాలకు కూడా చేరాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో ప్రతి ఏడాది ఎక్కువ సంఖ్యలో విక్రయ కేంద్రాలు వెలిశాయి. పట్టణంలో చిన్నవి, పెద్దవి కలిపి దాదాపు నుంచి 100 నుంచి 120కిపైగా కేంద్రాలు ఏర్పాటు చేయడం విశేషం. ప్రధాన రహదారులు, జనాలు సందడిగా ఉండే ప్రాంతాలతోపాటు కొన్ని చోట్ల గల్లీల్లో కూడా చిన్నపాటి దుకాణాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా న్యూటౌన్, పద్మావతీకాలనీ, క్లాక్ టవర్, మదీనా మసీద్, అశోక్ టాకీస్ చౌరస్తా, షాసాబ్‌గుట్ట, టీడీగుట్ట, పాతపాలమూరు, రామయ్యబౌలి, మోతీనగర్, మేనకాటాకీస్, వీరన్నపేట తదితర ప్రాంతాల్లో కేంద్రాలను విద్యుద్దీపాలతో అలంకరించి వినియోగదారులను ఆకర్శిస్తున్నారు. పట్టణంలో ప్రతి రోజు దాదాపు రూ.15 నుంచి రూ.20లక్షల వరకు ఈ వ్యాపారం జరుగుతోంది. విక్రయ కేంద్రాల మధ్య పోటీ పెరగడంతో కొంత మంది ప్లేట్ హలీం తింటే కూల్ డ్రింక్, మరి కొంత మంది ఒకటి కొంటే మరొకటి ఉచితంగా అందిస్తున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు హలీం, హరీస్‌ల గిరాకీ ఉంటోంది.



హలీంను ఆస్వాధిస్తున్న ప్రజలు

హలీం, హరీస్ ధరలు (రూ.లలో)	
హలీం (మటన్)	200-280 (ప్లేట్)
హరీస్ (చికెన్)	70-120 (ప్లేట్)
హలీం ఫ్యామిలీప్యాక్	800-1000
హరీస్ ఫ్యామిలీప్యాక్	500-600

తయారీ విధానం..

హరీస్ (హలీం) వంటకాల తయారీ విధానంగా ప్రత్యేకంగానే ఉంటుంది. వీటికి తయారీ కోసం దాదాపు 8 నుంచి 9 గంటల సమయం పడుతుంది. తెల్లవారుజామున నుంచే వీటి తయారీని ప్రారంభిస్తారు. ముందుగా మటన్‌ను నీటితో కలిపి గోధుమలు, అన్ని పప్పులు, బియ్యం పిండి, నెయ్యి, అల్లం వెల్లులి పేస్ట్, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, యాలకులు, దాల్చిన చెక్క, మిరియాలు, కొత్తిమీర, నూనే, డ్రై ఫ్రూట్స్‌లతో దాదాపు మూడు గంటలపాటు ఉడికించాలి. అనంతరం పెద్ద గరిటెతో గంట నుంచి రెండు గంటల వరకు బాగా కలుపుతారు. అనంతరం వేడిగా హలీమ్‌ను తీసి ప్లేట్లలో వేసి దానిలో షేర్వాను కలిపి వినియోగదారులకు అందిస్తారు. చికెన్‌తో చేసే విధానం కూడా దాదాపు ఇదే విధంగా ఉంటుంది.



రుచికరమైన హలీం, హరీస్

ఈ ఏడాది గిరాకీ పర్వాలేదు..



1981 నుంచి మా కుటుంబం హోటల్‌తోపాటు హలీం, హరీస్ సెంటర్ నడుపుతున్నాం. వినియోగదారుల అభిరుచికి అనగుణంగా తయారుచేసి విక్రయిస్తున్నాం. మా సెంటర్‌లో ఒక్కటి హరీస్ లేదా హలీం కొంటే మరొకటి ఉచితంగా అందజేస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకు గిరాకీ కొద్దిమేర పర్వాలేదు.

– మహ్మద్ బురాన్, మహబూబ్‌నగర్

వెలుగొమ్ములలో పర్యటించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మిడ్జిల్: 'వెలుగొమ్ములలో నీటి సమస్య తీరేనా' అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జిల్లా అధికారులు గ్రామంలో పర్యటించి నివేదికలను కలెక్టర్‌కు సమర్పించారు. శనివారం మిషన్ భగీరథ డీఈ రవీందర్, ప్రత్యేకాధికారి తహసీల్దార్ రాజునాయక్, ఏఈలు లావణ్య, ముజుమ్‌అలీ, కార్యదర్శి రాజశ్రీ గ్రామంలో పర్యటించారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. తక్షణమే రెండు గేట్ వాల్వ్‌లు బిగించాలని కార్యదర్శికి సూచించారు. వృథాగా ఉన్న బోరు నుంచి ట్యాంకు వరకు పైపులైన్, మోటార్ వ్యయంను అంచనా వేసి సమస్య తీర్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి



బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఎస్ఆర్ఐ: మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఫతేపూర్‌లో బొడ్రాయి పండుగలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి, కొండపై వెలసిన రామలింగేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, సుధాకర్‌రెడ్డి, భాస్కర్, చెన్నయ్య, పాండు, నర్సింహ, నరేష్, నాయక్, బాలరాజు పాల్గొన్నారు.

హాజరైన ఎంపీ, మాజీ మంత్రి..

బొడ్రాయి పండుగలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ప్రజలందరితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని చెప్పారు. తమ గ్రామానికి ఎలాంటి అరిష్టం జరగొద్దని, పాడి పంటలతో సంతోషంగా ఉండాలని ప్రజలందరూ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చెప్పిన తప్పుడు వాగ్దానాలను నమ్మి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌కు చెందిన జిల్లా ప్లంబర్ అసోసియేషన్ సభ్యులు, డబుల్‌బెడ్‌రూం కాలనీకి చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీల పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల వారు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం క్రిస్టియన్‌పల్లిలోని 523 సర్వే నంబర్‌లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్లంబర్ అసోసియేషన్ సభ్యులకు కావాల్సిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, చేరికల కమిటీ చైర్మన్ చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, అనిత, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, అజ్మత్‌అలీ, వాజిద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే తదితరులు

ఇఫ్తారు విందులో పాల్గొన్న ఎమ్మెల్యేలు



విందులో పాల్గొన్న ఎమ్మెల్యేలు

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసాన్ని పురస్కరంచుకుని జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎన్‌పీ.వెంకటేష్ తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందులో పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, స్థానిక సంస్థల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ముస్లింలకు పండ్లు తినిపించారు. ఎమ్మెల్యేలు, అతిథులను ఎన్‌పీ వెంకటేష్ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు సురేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, అబ్దుల్ హాదీ, జాకీర్, బెక్కరి అనిత, జహీర్ అఖ్తర్, సిరాజ్‌ఖాద్రీ, అజ్మత్‌అలీ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక రుగ్మతలను రూపుమాపాలి'



దొడ్డిపల్లిలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

నవాబుపేట: సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతలను తొలగించేందుకు అందరూ కృషి చేయాలని ఆర్‌ఐలు కిరణ్, గాయిత్రి సూచించారు. శనివారం మండలంలోని దొడ్డిపల్లిలో సామాజిక రుగ్మతల నివారణ కోసం పౌర హక్కుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో సామాజిక దురాచారాల మూలంగా అభివృద్ధి అడుగంటిందని వివరించారు. అందుకే అందరికి పౌరహక్కులపై అవగాహన అవసరమని తెలిపారు.

కలిసిమెలిసి ఉండాలి..

రాజాపూర్: గ్రామాల్లో కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలని ఆర్‌ఐ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాయపల్లిలో పౌరహక్కుల దినం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు.

రూ.10 కోట్ల ఆస్తిని సమకూర్చాం

జడ్చర్ల టౌన్: డీ కేటగిరిలో ఉన్న బాదేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని బీ కేటగిరిలోకి తీసుకురావటంతోపాటు రూ.10కోట్ల ఆస్తిని సమకూర్చామని సంఘ చైర్మన్ పాలెం సుదర్శన్‌గౌడ్ స్పష్టం చేశారు. శనివారం పీఏసీఎస్ కార్యాలయంలో మహాజనసభ నిర్వహించారు. సభతోపాటు ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు గడిచిందని, ఈ సమయంలో రైతుల ప్రయోజనం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. నాగసాల సమీపంలో సొంత డబ్బులు వెచ్చించి ఆరు ఎకరాల అసైన్డ్ భూమిని ప్రభుత్వం ద్వారా సంఘానికి తీసుకున్నామన్నారు. అందులో నాబార్డ్ రుణం రూ.కోటి85లక్షలతో 2,500మెట్రిక్ టన్నుల గోడౌన్ నిర్మాణం చేశామన్నారు. దాని విలువ ప్రస్తుతం రూ.10కోట్లకు చేరిందని, అదే విధంగా కార్యాలయాన్ని సైతం ఆధునీకరించామన్నారు. రైతుల ప్రయోజనం కోసం గ్రామాల్లోకి వెళ్లి యూరియా అందించామని, రైతుల నుంచి పాత బకాయిలు వడ్డీతో కలిపి రూ.కోటి65లక్షలు వసూలు చేశామన్నారు. అదనంగా రూ.2కోట్ల2లక్షల రుణాలు ఇచ్చామన్నారు. రైతుల నుంచి పాత బకాయిలు రూ.కోటి వరకు వసూలు కావాల్సి ఉందన్నారు. పీఏసీఎస్ ద్వారా అగ్రిమార్ట్ నిర్మాణం చేపట్టి రైతులకు అవసరమైన యూరియా, ఎరువులు, యంత్ర సామాగ్రి తక్కువ ధరలకే విక్రయించాలనేది తమ లక్ష్యమని, అందుకోసం ఈ ఏడాది కృషి చేస్తామని భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. సీఈఓ యాదగిరి గతేడాది ప్రగతిని సభకు వినిపించారు. సభలో వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ సుదర్శన్‌గౌడ్

పోలీస్‌స్టేషన్ సందర్శించిన డీఎస్పీ



చిన్నచింతకుంట: మండల పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు శనివారం సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలను ఎస్ఐ శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులను వెంటనే విచారించి పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

బీవీపీ కార్యవర్గం ఎంపిక



స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రతినిధులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శనివారం పాలమూరుశాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు రమేష్ చందర్ 2023–24లో చేపట్టిన కార్యక్రమాల గురించి, కార్యదర్శి భూషణ్‌పాండే అకౌంట్ల వివరాలు తెలియజేశారు. అనంతరం 2024–25కు ప్రాంత ఎన్నికల అధికారి పాండురంగం ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పాలమూరుశాఖ అధ్యక్షుడిగా భూషణ్‌పాండే, కార్యదర్శిగా రమేష్ చందర్, కోశాధికారిగా వెంకటేశ్వర గుప్త, ఉపాధ్యక్షులుగా వీఎస్ఆర్‌కే ప్రసాద్, యతిరాజాచారి, కార్యనిర్వాహక కార్యదర్శిగా చంద్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గం ప్రమాణాస్వీకారం చేశారు.

కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

కోయిల్‌కొండ: పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కార్మికులతో కలిసి సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డికి వినతి సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలను ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. నెలకు కేవలం రూ.9,500 ఇస్తున్నారని అవి కూడా ప్రతినెల సమయానికి రాకపోవడంతో కార్మికులు వారి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీనునాయక్, వెంకటయ్య, అజ్జుపాష, కురుమూర్తి, గోపాల్, రాందాస్, రాజన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిన్నచింతకుంట: మండలంలోని పల్లమరిలోని ఊక చెట్టువాగునుంచి శనివారం గ్రామానికి చెందిన రాంచందర్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు



మిడ్జిల్‌లో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: ఈ నెల 18న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. మండలంలో మొత్తం 8 కేంద్రాల్లో 1,824మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ముగియటంతో మైనార్టీ, కస్తూర్బా, గురుకులాలు, హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు ఇంటి బాట పట్టారు. తల్లిదండ్రులు హాస్టళ్ల వద్దకు చేరుకుని తమ పిల్లలను తీసుకెళ్లారు. పరీక్షలు ముగియటంతో ఇళ్ల వద్ద సమయం వృథా చేయకుండా భవిష్యత్ ప్రణాళిక సిద్ధం చేసుకుని సాగాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఓలు విద్యార్థులు సూచించారు.

మిడ్జిల్: మండలంలో జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 132 మంది, చైతన్య భారతి ఉన్నత పాఠశాలో 170 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రం, పెద్దవడ్డేమాన్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాలకు కలిపి 481 మంది విద్యార్థులకు గాను 476 మంది పరీక్షలకు హాజరయ్యారు.

రాజాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రంగారెడ్డిగూడ, తిర్మలాపూర్, రాజాపూర్ ఉన్నత పాఠశాలలో పాటు కేజీబీవీ పాఠశాల విద్యార్థులు మొత్తం 213 గాను ఒకరు గైర్హాజరయ్యారు.

దేవరకద్ర: దేవరకద్ర, కౌకుంట్ల మండల కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీవాణి శిశుమందిరంలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో 711 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. కౌకుంట్ల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 107 మంది పరీక్షలు రాశారు.



జడ్చర్లలో ఉపాధ్యాయులతో కలిసి ఫొటో దిగుతున్న కస్తూర్బా విద్యార్థులు

రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రం ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ రూరల్: దేశంలోని ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ సమానత్వం, వాక్ స్వాతంత్రం కల్పిస్తూ రాజ్యాంగాన్ని అంబేద్కర్ రచించారని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి అన్నారు. అలాంటి మహోన్నతమైన రాజ్యాంగాన్ని మార్చేసి మనుధర్మ శాస్త్రాన్ని తీసుకువచ్చి మన హక్కులను బీజేపీ ప్రభుత్వం హరించాలని చూస్తుందన్నారు. శనివారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో మద్దతు ధర కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాడుతున్న రైతులను కాల్చి చంపడం, మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి చిత్ర హింసలకు గురి చేసి నడిరోడ్డుపై కాల్చి చంపిన ఘటనలు చూస్తూనే ఉన్నామని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు పాలనను అంతమొందించాలని సంకల్పంతో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఉమ్మడి పది జిల్లాలను కలుపుతూ ఏప్రిల్ 2 నుంచి 8 వరకు రాజ్యాంగ రక్షణ యాత్ర ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ యాత్రకు ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిన్న, జిల్లా కోశాధికారి ఆంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి రవికుమార్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు